క్లుప్తంగా

ఎన్‌ఎస్‌ఎస్ శిబిరాలతో జాతీయ సమైక్యత



సర్టిఫికెట్లు అందుకున్న ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు

కామారెడ్డి అర్బన్: విద్యార్థులు జాతీయ సేవా పథకం(ఎన్‌ఎస్‌ఎస్) శిబిరాల్లో పాల్గొనడం ద్వారా సామాజిక బాధ్యత, నాయకత్వ నైపుణ్యాలు, వ్యక్తిత్వ నిర్మాణం, అభివృద్ధి జరుగుతుందని కామారెడ్డి ఆర్ట్స్‌అండ్ కళాశాల ప్రిన్సిపల్ విజయ్‌కుమార్ అన్నారు. కళాశాల 1, 2, 3 ఎన్‌ఎస్‌ఎస్ యూనిట్ల వారం రోజుల శిబిరాల ముగింపు శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ విద్యార్థులనుద్దేశించి మాట్లాడారు. వలంటీలర్లకు సర్టిఫికెట్లను అందజేశారు. సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ కిష్టయ్య, సమన్వయ కర్తలు జయప్రకాష్, ఎన్‌సీసీ అధికారి సుధాకర్, ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారి రాజ్‌గంభీర్‌రావు, చంద్రశేఖర్‌గౌడ్, శారద, దినకర్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలను సంరక్షించాలి



మెంగారంలో మొక్కలకు నీళ్లు పడుతున్న ఎంపీడీవో నరేష్

లింగంపేట(ఎల్లారెడ్డి): మండలంలోని 41 గ్రామ పంచాయతీల్లో నాటిన మొక్కలను వేసవిలో నీళ్లు పోసి సంరక్షించాలని ఎంపీడీవో నరేష్ సూచించారు. శుక్రవారం వాటరింగ్ డే సందర్భంగా మెంగారం గ్రామంలో మొక్కలను నీళ్లు పోశారు. ఎవెన్యూ ప్లాంటేషన్‌ను కాపాడాలన్నారు. అలాగే ప్రాథమికోన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం పరిశీలించారు. గ్రామ శివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించారు. కొలతల ప్రకారం పనులు చేయాలని సూచించారు. ఆయన వెంట కార్యదర్శి, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం



క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

కామారెడ్డి టౌన్: తెలంగాణ ప్రభుత్వం గోరు బోలి (లంబాడా) భాషను భారత రాజ్యాంగంలోని 8వ షెడ్యూల్‌లో చేర్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేసి కేంద్రానికి పంపిన సందర్భంగా ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. సీఎంతో పాటు మంత్రివర్గం, రాష్ట్ర నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు రాణాప్రతాప్ రాథోడ్, ఆల్ ఇండియా బంజార సేవ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కేతావత్ మోతిసింగ్, లంబాడా హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షుడు సునావత్ గణేష్ నాయక్, నాయకులు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలి



మాట్లాడుతున్న డీఎల్‌పీవో సురేందర్

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎండలు తీవ్రమైన నేపథ్యంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని ఎల్లారెడ్డి డీఎల్‌పీవో సురేందర్ సూచించారు. మండలంలోని అచ్చాయపల్లి, రామక్కపల్లి గ్రామాలను శుక్రవారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను ఆయన పరిశీలించారు. దీంతోపాటు ప్రాథమిక పాఠశాలతోపాటు అంగన్‌వాడీకేంద్రాలను ఆయన తనిఖీ చేశారు. అంతకుముందు నాగిరెడ్డిపేట మండలకేంద్రంలోని కస్తూర్బా పాఠశాలను ఆయన సందర్శించారు. ఉపాధ్యాయుల హాజరుపట్టికను పరిశీలించారు. ఆయనవెంట పంచాయతీ కార్యదర్శులు వెంకటరాములు, మల్లికార్జున్ ఉన్నారు.

బిచ్కుంద బార్ అసోసియేషన్ కమిటీ ఎన్నిక



అధ్యక్షుడు ప్రకాష్

బిచ్కుంద(జుక్కల్): బిచ్కుంద బార్ అసోసియేషన్ కమిటీని శుక్రవారం ఎన్నుకున్నామని బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శివాజీ తెలిపారు. అధ్యక్షుడిగా ప్రకాష్, వైస్ చైర్మన్ శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా శివాజీ, ట్రెజరీగా విఠల్ ఏకగ్రీవంగా ఎన్నుకున్నామన్నారు. సీనియర్ న్యాయవాదులు లక్ష్మణ్‌రావు, మల్లేశ్వర్, విఠల్, శ్రీనివాస్, విఠల్‌రావు, మహ్మద్ పాల్గొన్నారు.

ఎండతీవ్రతకు మూగ జీవాల విలవిల

- చెట్లనీడల్లో, నీటిమడుగుల్లో ఉపశమనం పొందుతున్న వైనం
- ఎండలకు మృత్యువాత పడే అవకాశం
- అప్రమత్తంగా ఉండాలని పశువైద్యాధికారుల సూచన



రాజంపేటలో చెట్ల నీడన సేదతీరుతున్న మేకలు



కుంటలో నీటిని తాగుతున్న జీవాలు

రాజంపేట: జిల్లాలో రోజురోజుకు ఎండలు ముదురుతున్నాయి. ఎండ, వడగాలులకు మనుషులతో పాటు మూగజీవాలు అల్లాడుతున్నాయి. ఇప్పటికే గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. రానున్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరగనున్నాయి. వేసవిలో పాడిపశువులు, మూగజీవాల పెంపకందారులు జాగ్రత్తలు తీసుకోవాలని పశువైద్యాధికారులు సూచిస్తున్నారు. పెంపుడు జంతువులను వీలైనంత వరకు ఉదయం, సాయంత్రం వేళల్లో మాత్రమే బయటకు తీసుకెళ్లాలి. కొట్టాల చుట్టూ తట్టుబొంతలు కట్టి నీటితో తడిపితే వడగాలుల ప్రభావం తగ్గుతుంది. పశువులకు పచ్చిమేత, తడిపిన దాణా ఇవ్వడం మంచిది. పశువులకు సుమారు 50 నుంచి 60 లీటర్ల నీటిని తాగించాలి. దాణాతో పాటు లవణ మిశ్రమం, పుష్కలంగా తాగునీరు ఇవ్వడం వల్ల డీహైడ్రెషన్‌కు గురికాకుండా కాపాడుకోవచ్చు. వడదెబ్బకు గురైన పశువులను వెంటనే తల, శరీరభాగాలను నీటితో తడుపుతూ నీటి పట్టున ఉంచి సమీపంలో ఉన్న పశువైద్యాధికారికి చూపించి చికిత్స అందించాలి.

వేడిగాలుల నుంచి కోళ్లకు రక్షణ..

కోళ్లకు వడదెబ్బ తగలకుండా ఉండాలంటే షెడ్డు మీద గడ్డి, తాటాకులు లేదా కొబ్బరి మట్టల్ని కప్పాలి. దీనివల్ల షెడ్డు లోపలి ఉష్ణోగ్రతలు 3 నుంచి 5 డిగ్రీల సెంటిగ్రేడ్ వరకు తగ్గుతాయి. కోళ్ల ఫారంలోకి గాలి ధారళంగా ప్రసరించేలా చూడాలి. అవసరమైతే ఫ్యాన్లు ఏర్పాటు చేయాలి. షెడ్డు పై భాగంలో స్ప్రింక్లర్లతోనూ పాగర్ల వంటి పరికరాలతోనూ నీటి తుంపర్లు పడేలా చూడాలి. కోళ్లఫారం చుట్టూ నీడనిచ్చే చెట్లు పెంచాలి. కోళ్ల వడదెబ్బకు గురైతే వాటిని తల మునగకుండా మిగిలిన శరీరాన్ని చల్లటి నీటిలో ముంచి తీయాలి. దీనివల్ల కోడి శరీర ఉష్ణోగ్రత సాధారణ స్థాయికి చేరుతుంది.

జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించాలి



రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలకు మూగ జీవాల పెంపకందారులు తప్పనిసరిగా జాగ్రత్తలు పాటించాలి. లేదంటే జీవాలు రోగాల బారిన పడి చనిపోయే అవకాశాలు ఉంటాయి. జీవాలకు సరైనా సమయంలో దాణా, నీరు అందించాలి. పెంపకం దారులు పశువుల మేతకు ఎండతీవ్రతను దృష్టిలో ఉంచుకొని మేతకు తీసుకెళ్లాలి.

– అనిల్ రెడ్డి, పశువైద్యాధికారి, రాజంపేట

వేసవిలో సోకే వ్యాధులు..

వేసవిలో పశువులకు గొంతువాపు, జబ్బవాపు వ్యాధులు ఎక్కువగా వస్తాయి. గొంతువాపు వ్యాధి సోకిన పశువులు శ్వాస తీసుకోవడంలో తీవ్ర ఇబ్బంది ఎదుర్కొంటాయి. దీనిని గురుక వ్యాధి అని కూడా అంటారు. ముఖ్యంగా 6 నెలల నుంచి 2 సంవత్సరాల వయస్సు ఉన్న పశువులకు ఎక్కువగా సోకుతుంది. వాతావరణం చల్లగా ఉండి తేమ ఎక్కువగా ఉన్నప్పుడు, వేసవిలో మేత లేక, వాతావరణంలో ఆకస్మిక మార్పులు సంభవించినప్పుడు, సూదుర ప్రయాణాలు చేసినప్పుడు పశువులకు ఈ వ్యాధి సోకే అవకాశం ఎక్కువగా ఉంటుంది.

ఒకే దేశం ఒకే ఎన్నిక కావాలి

- జమిలీ ఎన్నికలపై అపోహలను తొలగించాలి
- బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి



అక్కాపూర్‌లో మాట్లాడుతున్న బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి

నస్రుల్లాబాద్/రాజంపేట/నాగిరెడ్డిపేట/ఎల్లారెడ్డి/మాచారెడ్డి /లింగంపేట : దేశంలో ఒకేసారి ఎన్నికలు జరగాలని బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి నరేందర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మాచారెడ్డి మండలం అక్కాపూర్ గ్రామంలో ఒకే దేశం ఒకే ఎన్నికపై బీజేపీ దృష్టికోణంపై వర్క్‌షాప్ నిర్వహించారు.ఈకార్యక్రమంలో ఆయన మాట్లాడారు. నస్రుల్లాబాద్‌లో నిర్వహించిన వర్క్‌షాప్‌లో మండల అధ్యక్షులు సున్నం సాయిలు మాట్లాడారు. రాజంపేట మండలం శివాయిపల్లి గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు సంపత్ రెడ్డి అధ్యక్షతన వర్క్‌షాప్ నిర్వహించారు.ఈకార్యక్రమంలో బీజెవైఎం జిల్లా అధ్యక్షుడు నంది వేణు మాట్లాడారు.నాగిరెడ్డిపేట మండలకేంద్రం గోపాల్‌పేటలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తల వర్క్‌షాప్‌లో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యులు జక్సాని దత్తురాములు మాట్లాడారు. ఎల్లారెడ్డి పట్టణంలో నిర్వహించిన వర్క్ షాపులో బీజేపీ నాయకులు బాలకిషన్ మాట్లాడారు. లింగంపేట మండల కేంద్రంలోని పెద్దమ్మ ఆలయంలో నిర్వహించిన వర్క్‌షాపులో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు వెంకట్రావు మాట్లాడారు. జమిలీ ఎన్నికలపై ప్రజలకు ఉన్న అపోహలను తొలగించి అవగాహన కల్పించాలన్నారు. దేశం మొత్తం ఒకేసారి ఎన్నికలు నిర్వహించడం వల్ల ఆర్థికంగా ఎంతో ఖర్చు తప్పుతుందని, పోటీచేసే అభ్యర్థులకు ఆర్థికభారం కొంతమేర తగ్గడంతోపాటు సమయం వృథా అవదని వారు పేర్కొన్నారు.ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



గోపాల్‌పేటలో మాట్లాడుతున్న దత్తురాములు



నస్రుల్లాబాద్‌లో పాల్గొన్న బీజేపీ నాయకులు

అన్ని మతాలకు ప్రాధాన్యం



పిట్లం: ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే

పిట్లం(జుక్కల్): రాష్ట్రంలోని అన్ని మతాలకు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తుందని ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతారావు పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని భారత్ గార్డెన్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు ఆయన హాజరై మాట్లాడారు. మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు, మసీద్ కమిటీ సభ్యులు, మైనారిటీలు పాల్గొన్నారు.

బాన్సువాడ/నస్రుల్లాబాద్ : బాన్సువాడ మండలం బోర్లం గ్రామంలో శుక్రవారం మాజీ ఎంపీటీసీ సభ్యురాలు శ్రావణి దేవేందర్‌రెడ్డి దంపతులు ఇఫ్తార్ విందు ఇచ్చారు. నస్రుల్లాబాద్ మండల కేంద్రంలో ప్రభుత్వం తరఫున నిర్వహించిన ఇఫ్తార్ విందులో తహసీల్దార్ ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు. ఈకార్యక్రమంలో మైనారిటీలు పాల్గొన్నారు.

నాణ్యతతో సీసీ రోడ్లు నిర్మించాలి



సీసీ రోడ్డు నిర్మాణ పనులను పరిశీలిస్తున్న అడిషనల్ డీఆర్డీవో వామన్‌రావు

నిజాంసాగర్/ఎల్లారెడ్డి: నాణ్యతతో సీసీ రోడ్లు నిర్మించాలని, నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అడిషనల్ డీఆర్డీవో వామన్‌రావు అన్నారు. శుక్రవారం మండల కేంద్రం నుంచి నిజాంసాగర్ ప్రాజెక్టు వెళ్లే రోడ్డుపై సీసీ నిర్మాణ పనులను ఆయన పరిశీలించారు. రూ. 20 లక్షలతో సీసీ నిర్మాణం చేపడుతున్నామ న్నారు. ఆయన వెంట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు ఏలే. మల్లికార్జున్, ఈజీఎస్ ఏపీవో శివకుమార్ తదితరులున్నారు. మహమ్మద్ నగర్ మండలం తుంకిపల్లితండాలో రూ.10లక్షలతో నిర్మించనున్న సిమెంట్ రోడ్లు నిర్మాణ పనులను మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి ప్రారంభించారు. ఎల్లారెడ్డి మండలం మత్తమాల గ్రామంలో రూ.5 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు పనులను కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షులు సాయిబాబా ప్రారంభించారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించాలి



దేశాయిపేట్‌లో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పోచారం భాస్కర్‌రెడ్డి

బాన్సువాడ రూరల్: రైతులు తాము పండించిన ధాన్యాన్ని ప్రభుత్వ కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి, మద్దతుధరను పొందాలని దేశాయిపేట్ సొసైటీ చైర్మన్ పోచారం భాస్కర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఆయన దేశాయిపేట్ గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. అంతకు ముందు ఇటీవల గుండెపోటుతో మృతి చెందిన సొసైటీ వైస్ చైర్మన్ అంబర్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు.కార్యక్రమంలోనాయకులు మంత్రి గణేష్, ఎజాస్, మోహన్‌రెడ్డి, నారాయణ, ప్రశాంత్, బస్వయ్య తదితరులు పాల్గొన్నారు.

అలరించిన తెరవే ఉగాది కవి సమ్మేళనం



కవులను సన్మానిస్తున్న తెరవే నాయకులు

కామారెడ్డి అర్బన్ : తెలంగాణ రచయిత వేదిక ఆధ్వర్యంలో స్థానిక సీనియర్ సిటిజన్ ఫోరం భవనంలో శుక్రవారం ఉగాది కవి సమ్మేళనం నిర్వహించారు. ఈసందర్భంగా పలువురు కవులను ఘనంగా సన్మానించారు. తెరవే జిల్లా అధ్యక్షుడు గఫూర్ శిక్షక్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో కవి, రచయిత యెనిశెట్టి గంగాప్రసాద్ రాసిన సామాజిక అంశాల సమాహారం పద్యదర్శిని ఆవిష్కరించగా మిలికొండ సునీత సమీక్షించారు. కాలమిస్ట్ జి.లచ్చయ్య, సీనియర్ సిటిజన్స్ ఫోరం జిల్లా అధ్యక్షుడు పున్న రాజేశ్వర్, కవులు సూరారం శంకర్, మంద పీతాంబర్, నాగభూషణం, మోహన్‌రాజ్, కాసర్ల రామచంద్రం, సునీత, కాశ నర్సయ్య, తిరుపతి తదితరులు కవితాగానం చేశారు.

సంస్కార భారతి ఉగాది ఉత్సవం

కామారెడ్డి అర్బన్: శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాది సందర్భంగా శుక్రవారం స్థానిక వశిష్ట డిగ్రీ కళాశాలలో సంస్కార భారతి ఆధ్వర్యంలో ఉగాది ఉత్సవం, కవి సమ్మేళనం నిర్వహించారు. సంస్కార భారతి ప్రాంత సంఘటన మంత్రి నిరంజన్ ఉగాది విశిష్టతను వివరించారు. సంస్కార భారతి జిల్లా అధ్యక్షుడు సమ్మిరెడ్డి, ప్రధాన కార్యదర్శి పి.సత్యప్రసాద్, కన్వీనర్ జి.ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాస్ రెడ్డి తదితరులు మాట్లాడారు. కవులు శర్వాణి, ప్రశాంతి, వైద్య ఉమా శేషారావు, నల్ల నాగభూషణం, బాలరెడ్డి, ప్రసాద్, నర్సింలు, ముల్క స్రవంతి, బసంత్‌రాజు, మనోహర్, రమేష్‌గౌడ్, బాలరాజగౌడ్, సాయిబాబా, రాజులు తమ ఉగాది కవితా గానంతో అలరించారు. సాత్విక, సహస్రలు కూచిపూడి నాట్యాన్ని ప్రదర్శించారు.

వక్ఫ్ బోర్డు సవరణ బిల్లుకు వ్యతిరేకంగా నిరసన



నిరసన తెలుపుతున్న ముస్లింలు

కామారెడ్డి టౌన్: వక్ఫ్ బోర్డు సవరణ బిల్లును వ్యతిరేకిస్తూ ముస్లింలు నిరసన తెలిపారు. రంజాన్ చివరి శుక్రవారం అల్విదా జుమా సందర్భంగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని తహసీల్ మసీదులో ప్రార్థనల అనంతరం ముస్లింలు నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు.

సబ్ కలెక్టర్‌కు అంగన్‌వాడీల వినతి



వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ టీచర్లు

బాన్సువాడ : అంగన్‌వాడీ టీచర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో శుక్రవారం సబ్ కలెక్టర్ కిరణ్మయికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు ఖలీల్ మాట్లాడుతూ నస్రుల్లాబాద్ మండలంలో అంగన్‌వాడీ టీచర్లను ఇబ్బందులకు గురి చేస్తున్న సూపర్‌వైజర్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు మహాదేవి, రాధా, వజ్ర, రేణుక, శివగంగా తదితరులు ఉన్నారు.

పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలి



ఇస్రోజీవాడి శిబిరంలో పాల్గొన్న అధికారులు

కామారెడ్డి రూరల్/మద్నూర్ : పశుపోషకులు పశువైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలని మద్నూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ సౌజన్య, వైస్ చైర్మన్ పరమేశ్ పటేల్ పేర్కొన్నారు. డోంగ్లీ మండల కేంద్రంలో శుక్రవారం మద్నూర్ వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో, కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో కామారెడ్డి మండలం ఇస్రోజీవాడి గ్రామంలో ఉచిత పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు.ఈసందర్భంగా పశువులకు వైద్యులు రవికిరణ్, అనిల్ రెడ్డి, గోపాలమిత్రలు చికిత్సలు చేశారు. అనంతరం ఉచితంగా మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కామారెడ్డి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ధర్మగొని లక్ష్మీ రాజాగౌడ్, వైస్ చైర్మన్ మిన్కూరి బ్రహ్మానందరెడ్డి, డైరెక్టర్లు, తదితరులు పాల్గొన్నారు.

ఇసన్నపల్లి పాఠశాల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఎంఈవో రాజగంగారెడ్డి

భిక్కనూరు : మండలంలోని ఇసన్నపల్లిలో ప్రాథమిక పాఠశాలను శుక్రవారం ఎంఈవో రాజగంగారెడ్డి తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు రిజిస్టరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు వివరాలను అడిగి తెలుసుకున్నారు. మంచి బోధన అందించాలని ఆయన ఉపాధ్యాయులకు సూచించారు.

గాంధారిలో..

గాంధారి : విద్యార్థులందరూ ప్రార్థనా సమయానికి వచ్చేలా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని ఎంఈవో శ్రీహరి అన్నారు. శుక్రవారం ఆయన స్థానిక ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎండలు ముదరుతున్న నేపథ్యంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యార్థులకు సూచించారు. ఎఫ్ఏ4, ఎఫ్ఎల్ఎం పరీక్షల ప్రగతిని ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులను ఆదేశించారు.

రైతులకు ఇబ్బందులు కలుగకుండా చూస్తాం

సదాశివనగర్(ఎల్లారెడ్డి): వ్యవసాయ భూములకు రైతులు వెళ్లడానికి గతంలో రోడ్లతో ఇబ్బందులు పడేవారని, ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండా చూస్తామని సీడీసీ చైర్మన్ ఇర్షాదొద్దిన్ సూచించారు. శుక్రవారం అడ్లూర్ ఎల్లారెడ్డి గ్రామ శివారులో వ్యవసాయ భూములకు వెళ్లడానికి వీలుగా జేసీబీతో రోడ్లను చదును చేశారు.

ఆధ్యాత్మికం

శబరిమాత ఆశ్రమానికి రూ.3.50 లక్షలు విరాళం



విరాళం అందిస్తున్న భక్తులు

తాడ్వాయి(ఎల్లారెడ్డి): మండలంలోని శబరిమాత ఆశ్రమానికి శుక్రవారం శబరిమాత స్వగ్రామమైన తొగిటతో పాటు మెదక్ జిల్లాలోని పలుగ్రామాలకు చెందిన భక్తులు నగదును విరాళంగా అందజేశారు. ఆశ్రమ కమిటీ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో జమచేసిన రూ.3.51 లక్షల నగదును విరాళంగా అందజేశారు. అలాగే శబరిమాత ఆశ్రమంలో పల్లకీసేవ కార్యక్రమాన్ని భక్తులు ఘనంగా నిర్వహించారు.

బెజుగంచెరువు తండాలో గిరిజనుల ప్రత్యేకపూజలు



భోగ్‌బండార్ నిర్వహిస్తున్న స్వాములు

నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బెజుగంచెరువుతండాలోని శ్రీ జగదాంబమాత, సేవాలాల్ మహరాజ్ ఆలయం వద్ద శుక్రవారం స్వామి మాలాధారులు ప్రత్యేకపూజలు చేశారు. ఆలయం ఎదుట భోగ్‌బండార్ కార్యక్రమాన్ని చేశారు. దీంతోపాటు నాగిరెడ్డిపేట, ఎల్లారెడ్డి, లింగంపేట మండలాలకు చెందిన సుమారు 150మంది మాలాధారులకు తండావాసులు భిక్ష ఏర్పాటు చేశారు.

సంక్షిప్తం

కులగణనకు సంబంధించిన వేతనాలు చెల్లించాలి

కామారెడ్డి అర్బన్: జిల్లాలో ఉపాధ్యాయులచేత నిర్వహించిన కులగణన సర్వేకు సంబంధించిన గౌరవ వేతనం చెల్లించాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఎన్‌సీ ప్రభాకర్, బి దేవులా కలెక్టర్‌కు ఇచ్చిన వినతి ప్రతంలో కోరారు. సర్వే చేసి 5 నెలలు అవుతున్న గౌరవ వేతనాలు చెల్లించలేదని వారు తెలిపారు.

పాఠశాలకు ఫర్నీచర్ అందజేత

మాచారెడ్డి : మండలంలోని లచ్చాపేట ఉన్నత పాఠశాలకు అదే గ్రామానికి చెందిన చెప్యాల గోవర్ధన్‌రెడ్డి రూ.50 వేల విలువైన ఫర్నీచర్‌ను అందజేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం లక్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి దాతకు కృతజ్ఞతలు తెలిపారు.

పోగొట్టుకున్న సెల్‌ఫోన్..

మాచారెడ్డి : పోగొట్టుకున్న సెల్‌ఫోన్ ను సీఈఐఆర్ పోర్టల్ ద్వారా ట్రేస్ చేసి శుక్రవారం బాధితునికి అందజేసినట్లు ఎస్సై అనిల్ తెలిపారు. మండలంలోని మాచారెడ్డి చౌరస్తాకు చెందిన దొంతరబోయిన రంజిత్ సెల్‌ఫోన్ పోగొట్టుకుని ఫిర్యాదు చేశాడని వెల్లడించారు.

అంతర్జాతీయ స్థాయిలో విద్యార్థి ప్రతిభ

కామారెడ్డి టౌన్: ముంబాయిలో జరిగిన ఇంటర్నేషనల్ ఇంగ్లీష్ ఒలంపియాడ్‌లో అంతర్జాతీయ స్థాయిలో జిల్లాకు చెందిన విద్యార్థి సత్తా చాటాడు. జిల్లా కేంద్రంలోని ఎస్పీఆర్ పాఠశాల విద్యార్థి ఆర్మిత్‌రావు జూనియర్ విభాగంలో జాతీయ స్థాయిలో రెండో ర్యాంక్ సాధించినట్లు స్కూల్ కరస్పాండెంట్ కొమిరెడ్డి మారుతి తెలిపారు. అవార్డు రూ. 40వేలతో పాటు ప్రశంసపత్రం, కప్‌ను విద్యార్థి అందుకున్నాడు.

కంటి వైద్య శిబిరం

పిట్లం(జుక్కల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆస్పత్రిలో శుక్రవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించినట్లు ఆప్తాల్మిక్ ఆఫీసర్ హరికిషన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కంటి సమస్యలతో బాధపడుతున్న వారికి కంటి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు.

నేటి ఎమ్మెల్సీ కవిత పర్యటన విజయవంతం చేయాలి

రామారెడ్డి: మండల కేంద్రంలో శనివారం బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పర్యటించనుందని మాజీ ఎంపీపీ దశరథ్ రెడ్డి తెలిపారు. స్థానిక కాలభైరవ ఆలయంలో ప్రత్యేక పూజలు చేయనున్నట్లు వెల్లడించారు. మండలంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్సీ కవితకు ఘనస్వాగతం పలకడానికి తరలిరావాలని కోరారు.

వచ్చేనెల 2న ఎస్సీ సంఘాలతో సమావేశం

కామారెడ్డి అర్బన్: ఏప్రిల్‌లో డాక్టర్ బాబూ జగ్జీవన్‌రామ్ 118వ జయంతి, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ 134 జయంతి ఉత్సవాల సందర్భంగా ఏప్రిల్ 2న మధ్యాహ్నం 3 గంటలకు కలెక్టరేట్‌లో ఎస్సీ సంఘాల నాయకులతో సమన్వయ సమావేశం ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని అన్ని ఎస్సీ సంఘాల నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలని కోరారు.

ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదు

మద్నూర్(జుక్కల్): ప్రభుత్వ ఉద్యోగికి పదవీ విరమణ తప్పదని తహసీల్దార్ ముజీబ్ అన్నారు. మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం డిప్యూటీ తహసీల్దార్ భీమ్‌రావు ఈ నెల 31న పదవీ విరమణ అవుతుండడంతో కార్యక్రమం ఏర్పాటు చేశారు. డిప్యూటీ తహసీల్దార్ భీమ్‌రావు దంపతులకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది ఘనంగా సన్మానించారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
కామారెడ్డి & ఎల్లారెడ్డి
96034 62494
99122 20764
Office mail : nzbadvt@gmail.com

సాక్షి
పాఠక మహాశయులకు విజ్ఞప్తి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షికి బదులుగా ఇతర దిన పత్రికలు వేస్తున్న యెడల ఈ ఫోన్ నంబర్లకు ఉదయం 7.00 గం॥ల నుండి రాత్రి 8.00 గం॥ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును.
బాన్సువాడ: యం. మధుసూధన్ : 9951027699
ఎల్లారెడ్డి: ఎం. శ్రీనివాస్ : 9704490298
కామారెడ్డి : కె. రాజు : 9949699861
టోల్ ఫ్రీ నెం. 1800 425 9899